
'ప్రజావాణి' మంగళవారానికి వాయిదా

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న సోమవారం వ్యవసాయ, ఉద్యానశాఖలకు చెందిన కృషికల్ప, అగ్రిసినర్జీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజావాణికి రావాలనుకున్న వారు ఈ విషయాన్ని గమనించి మంగళవారం ఫిర్యాదులను అందజేయాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3 సిద్దిపేట
ఆదివారం 8 డిసెంబరు 2024


చక్రిభజన ప్రదర్శన చేస్తున్న కొడకండ్ల గ్రామ యువత

చరిత్రపుటల్లో... చక్రిభజన

మరుగునపడుతున్న

కళను బతికించుకుంటున్న గ్రామస్థులు

నేటితరానికి ఆదర్శం కొడకండ్ల గ్రామ యువత

ఆనాటి సీఎం మర్రి చెన్నారెడ్డి నుంచి

శ్రీనటరాజ జ్ఞాపికను అందుకున్న భజన బృందం

Sunday Special 5లో..

ఉరుకుల పరుగుల జీవితంలో సంప్రదాయ కళలను పట్టించుకునేవారే కరువయ్యారు. పాతకాలపు సాంస్కృతిక కార్యక్రమాలు అయితే పూర్తిగా ప్రాధాన్యం తగ్గిపోతున్నాయి. ఈ తరుణంలో చక్రిభజన మరుగున పడిపోకుండా కళకు జీవం పోస్తున్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామ యువత.. ఇక్కడి యువకులు గజ్జె కట్టి, జెండా పట్టి, కోలాట ప్రదర్శనతో చిందేస్తే చూసేవారు మంత్రముగ్ధులవ్వాల్సిందే. వారి నైపుణ్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఆ ఊరికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చారు. గ్రామీణ సంస్కృతికి జీవం పోయాలని, నాటి కలను బతికించుకోవాలన్న లక్ష్యంతో భజన కార్యక్రమం చేపట్టి.. అలనాటి చక్రిభజన కళను సమాజం మరిచిపోకుండా నవ సమాజానికి అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో నవోదయం

- నవోదయ విద్యాలయ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

సంగారెడ్డిఅర్బన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దశాబ్దకాల జిల్లా ప్రజల ఎదురుచూపులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లాకో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు డిమాండ్ వినిపించింది. కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క నవోదయ కూడా మంజూరు కాలేదు. తాజాగా సంగారెడ్డి జిల్లాకు నవోదయ విద్యాలయం వరించడంతో ఇక్కడి విద్యార్థి లోకానికి ప్రయోజనం చేకూరనుంది.

గ్రామీణ విద్యార్థులకు సమగ్ర విద్య

గ్రామీణ విద్యార్థులకు సమగ్ర విద్యనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధిశాఖ ద్వారా జవహర్ నవోదయ విద్యాలయాల స్థాపనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్‌లో 1987లో నవోదయ విద్యాలయం ఏర్పాటైంది. సంగారెడ్డి జిల్లాలో మరో విద్యాలయం మంజూరు చేసింది. నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలంటే సుమారు 30 ఎకరాల స్థలం అవసరం. 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో తరగతిని పెంచుకుంటూ వెళ్తూ 12వ తరగతి వరకు చదివే వెసులుబాటు ఉంటుంది. బాల బాలికలకు వేర్వేరుగా వసతి కల్పిస్తారు. పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ విధానంలో నాణ్యమైన విద్య అందిస్తారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా ఎంపిక పరీక్ష నిర్వహించి అందులో మంచి మార్కులు పొందినవారికే 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలి
- కలెక్టర్ మను చౌదరి


అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ మను చౌదరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ నిర్వహణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించిందన్నారు. ఇది వరకు నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్ ద్వారా సర్వేయరు నమోదు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన చోట అధికారులు తగిన సిబ్బందిని నియమించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా వివరాల నమోదు చేపట్టాలని ఆయన సూచించారు. ఇంటి స్థలం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లన నిశితంగా పరిశీలించాలని, అవి సరైనవని నిర్ధారించుకున్న తర్వాతనే యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనర్హులకు ఇళ్లు ఇవ్వకుండా, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. అధికారులు సందేహాలు పూర్తిగా నివృత్తి చేసుకుని, గ్రామ, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసుకుని, సర్వే ప్రక్రియను ప్రారంభించి 15 రోజుల్లోగా పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జడ్పీ సీఈవో రమేష్, 2బీహెచ్‌కే నోడల్ అధికారి శ్యాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

వర్గల్/ములుగు: గురుకులాల్లో ఉండే విద్యార్థులకు రుచితో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శనివారం వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయం, ములుగులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్గల్ నవోదయ విద్యాలయంలో డైనింగ్ హాల్, వసతి గృహాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, స్టోర్‌రూం పరిశీలించి కాలం చెల్లిన ఆహార పదార్థాలను ఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదని సూచించారు. మెనూ తప్పకుండా పాటించాలన్నారు. నవోదయ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ రాజేందర్‌ను అభినందించారు. ములుగు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. బాత్‌రూం మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, మిషన్‌భగీరథ వాటర్ సరఫరాకు అదనపు సంపు నిర్మాణం చేపట్టాలని గురుకుల ప్రిన్సిపాల్ పుష్పలత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు వచ్చి మరమ్మతులు, నిర్మాణాల పరిశీలిస్తారని ఆయన చెప్పారు. అనంతరం జూనియర్ కళాశాలలోని ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదలతో ముందుకు సాగాలని, సమయాన్ని ఎట్టిపరిస్థితుల్లో వృథా చేసుకోవద్దని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేం


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామకార్యదర్శులు

జగదేవ్‌పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేమంటూ జగదేవ్‌పూర్ ఎంపీడీవో యాదగిరికి పలువురు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోజువారీ కార్యక్రమాలు, ఇటీవల నిర్వహించిన సర్వేతో పనిభారం ఎక్కువ అవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయం రెవెన్యూ, గృహ నిర్మాణశాఖలకు సంబంధించినది కావున ఆ అధికారులతో సర్వే చేయించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేయించడం వల్ల పనిభారం పెరిగి పంచాయతీ ఎన్నికలు, ఈజీఎస్, రోజువారి కార్యక్రమాలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని వాపోయారు. ప్రతిరోజు గ్రామాల్లో ఉండే తామే ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తే తమకు ఇల్లు రాకుండా చేశారని గ్రామాల వ్యతిరేకత వచ్చే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండలంలో పలు గ్రామా లకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎగవేతలకు ఏడాది

- ఇచ్చిన హామీలు, గ్యారంటీలను మరిచారు
- సిద్దిపేట నియోజకవర్గంపై ఎందుకింత అక్కసు
- రూ.900 కోట్లతో చేపట్టిన అభివృద్ధిని అడ్డుకున్నారు
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తా
- ఏడాదిలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు
- హాస్యాస్పదంగా కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవాలు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు 7: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో ఎగవేతలు తప్ప అభివృద్ధి, సంక్షేమం కానరాలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, గ్యారంటీలను గాయబ్ చేశారని ధ్వజమెత్తారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై మండిపడ్డారు. ఏడాది కాలంలోనే రాష్ట్రాన్ని పదేళ్ల వెనక్కు తీసుకెళ్లారని ఆరోపించారు. తెలంగాణ రైజింగ్ కాదని, తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాలను క్లోజింగ్ చేస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేస్తున్నదిగా?

రూ.2లక్షల రుణమాఫీని పూర్తిగా అమలు చేసిందా. ఎకరాకు ఏటా రూ.15000 రైతుభరోసా డబ్బులు ఇస్తుందా. ఆటోడ్రైవర్లకు న్యాయం చేశారా. మహిళలకు రూ.2,500 నెలనెలా ఇస్తున్నారా. కౌలురైతులను ఆదుకున్నారా. సన్నవడ్లు పండించిన రైతులకు మేలు జరిగిందా. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లక్ష రూపాయలు, తులం బంగారం ముట్టజెప్పారా..? అనే విషయాలపై ప్రజలు ఆలోచించాలి. ఉచిత గ్యాస్, విద్యుత్ పథకాలు కూడా అంతంతమాత్రమే. ఇవి నిజంగా అమలైతే దరఖాస్తులు ఎందుకు పెడుతున్నారు. బస్సు తప్ప అంతా తుస్సే అని అర్థమైంది. ఆ బస్సు ప్రయాణం కూడా సరిగా లేదు.

విజయోత్సవాలపై మీరు కావాలనే విమర్శలు చేస్తున్నారట?

ఏం సాధించారని వాళ్లు విజయోత్సవాలు చేస్తున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా రాష్ట్రం ఉంది. అనవసర డాంబికాలు తప్ప అభివృద్ధి పనులే లేవు. విజయోత్సవాలను చూసి ప్రజలు నవ్వుకునే పరిస్థితి వచ్చింది. అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్‌కు విజయోత్సవమా.. నిధులను రద్దు చేయడమే తెలంగాణ రైజింగ్ నినాదమా వారే చెప్పాలి.

సిద్దిపేట అభివృద్ధి నిధులను రద్దుచేశారని ఎలా ఆరోపిస్తున్నారు?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నాం. ఇంకా రూ.900 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది. కొన్ని పనులు కూడా ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నిధులన్నీ రద్దు చేసింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ఏయే పనులు నిలిచిపోయాయి?

బుస్సాపూర్, రాఘవాపూర్, రామునిపట్ల, మాచాపూర్ గ్రామాల్లో రూ.47.50 కోట్లతో రహదారి విస్తరణ పనులు, రూ.81 కోట్లతో సిద్దిపేట టు ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రహదారి, సిద్దిపేట నుంచి కిష్టసాగర్ రహదారి పనులు నిలిచిపోయాయి. రూ.23 కోట్లతో శిల్పారామం, రూ.15 కోట్లతో నెక్లెస్ రోడ్డు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు సంబంధించి రూ.25కోట్లు, రంగనాయకసాగర్ టూరిజం పనులకు రూ.100 కోట్లు, వెయ్యి పడకల ఆసుపత్రిలో ఇతర

మిగతా 6వ పేజీలో...


వర్గల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తాం

- ఎక్కడ ఇబ్బంది తలెత్తినా అధికారులపై చర్యలు తప్పవు
- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

4

అకాల వర్షం

- జలమయమైన రోడ్లు
- పలు గ్రామాల్లో తడిసిన ధాన్యం

5


సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం



యునాని దవాఖాన ఉన్నా..లేనట్టే!?

- విధులకు హాజరుకాని ఇన్‌చార్జి వైద్యురాలు
- పట్టింపులేని జిల్లా అధికారులు
- మూతపడే దిశగా ఆసుపత్రి

6

పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా


పోలింగ్‌కేంద్రాల ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి


సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికార యంత్రాంగం గ్రామపంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతుంది. ఈ మేరకు జిల్లాలోని 491 గ్రామ పంచాయతీల్లో 4350 పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి శనివారం కలెక్టరేట్‌లోని పంచాయితీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ ముసాయిదా జాబితాను అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.



తాటివనంలో రామచిలుకల సందడి..

చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో ఉన్న తాటివనాల్లో రామచిలుకలు సందడి చేస్తున్నాయి.. తాటిచెట్లకు తొర్రలు చేసి గూడును ఏర్పాటు చేసుకున్నాయి. ఆ ఊరి ప్రజలతో పాటు అటుగా వెళ్లే వాహనదారులకు ఆ చిలుకల కిలకిలారావాలు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. కొన్ని తాటిచెట్ల తొర్రల్లో గుడ్లగూబలు కూడా నివాసం ఏర్పర్చుకున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)



రెండు రోజులపాటు
సీసీఐ కొనుగోళ్లు బంద్

మునిపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8, 9వ తేదీల్లో సీసీఐ కొనుగోళ్లు రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మంతూరి సుధాకర్‌రెడ్డి, సీసీఐ కమర్షియల్ ఆఫీసర్ వరుణ్ రఘువీర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వ ఎక్కువగా ఉండడంతో ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మంగళవారం కొనుగోళ్లు పునః ప్రారంభమవుతాయని తెలిపారు. కేంద్రాలకు పత్తి తీసుకవచ్చే రైతులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు
పటాన్‌చెరు విద్యార్థి


వరుణ్‌కుమార్‌రాథోడ్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పటాన్‌చెరు శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కేతావత్ వరుణ్‌కుమార్‌రాథోడ్ ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించే పోటీల్లో వరుణ్‌కుమార్ తలపడనున్నారు.

బంధంకొమ్ము చెరువుకు..
కబ్జాల చెర

జీవం కోల్పోయిన జీవవైవిధ్య చెరువు


కబ్జాలతో కుచించుకుపోయిన బంధంకొమ్ము చెరువు

- నోటీసులు జారీ చేసినా ఆగని ఆక్రమణలు
- నిర్మాణ సంస్థలకు అనుగుణంగా కాల్వల మళ్లింపు
- డ్రైనేజీ నీరు చేరి మురికి కూపంగా చెరువు
- దుర్గంధభరితంగా మారిన వలస పక్షుల విడిది కేంద్రం

పటాన్‌చెరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన చెరువు నేడు ఆక్రమణలు, మురుగు నీటితో కళావిహీనంగా తయారైంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బంధంకొమ్ము చెరువు పరిధిలో ఆక్రమణల పర్వం కొనసాగుతున్నది. 2010కి ముందు సుమారు 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువు నేడు కేవలం ఐదారెకరాలకు పరిమితమైంది. అమీన్‌పూర్ పెద్దచెరువు దిగువన ఉండే బంధంకొమ్ము చెరువు ఒకప్పుడు వలస పక్షులతో కలకలలాడేది. చెరువు చుట్టూ


బంధంకొమ్ము చెరువులోకి పారుతున్న మురుగు నీరు

పెద్దఎత్తున భవనాలు, కాలనీలు విస్తరించడంతో క్రమంగా చెరువు ఆనవాళ్లు కోల్పోతోంది. కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల నుంచి ప్రవహించే డ్రైనేజీ నీరు నేరుగా చెరువులోకి వచ్చి చేరుతోంది. దీంతో చెరువు చుట్టుపక్కల ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధాన్ని వెదజల్లుతున్నది. మురికికూపంగా మారడంతో గత ఐదేళ్లుగా మత్స్యకారులు చేపలు వేయడం మానేశారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోకి వచ్చే సర్వే నంబర్లలో చేపట్టిన నిర్మాణాలకు ఇరిగేషన్ శాఖ నోటీసులు జారీ చేస్తున్నా ఎక్కడా ఆక్రమణలు ఆగడం లేదు.

కాల్వల మళ్లింపునకు ఎన్‌వోసీలు

బంధంకొమ్ము చుట్టుపక్కల నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ల నిర్మాణ సంస్థలకు అనుగుణంగా గొలుసు కట్టు చెరువు కాల్వలను దారి మళ్లించేందుకు ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీలు ఇవ్వడం వివాదాస్పదమైంది. బఫర్ జోన్లలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లకు హెచ్‌ఎండీఏ, స్థానిక మున్సిపల్ అధికారులు నోటీసులను జారీ చేశారు. సదరు నిర్మాణాలపై హైడ్రా, మున్సిపల్ అధికారులు ఎలా స్పందిస్తారని వేచిచూస్తున్నారు. గతంలో అప్పటి సంగారెడ్డి కలెక్టర్ హన్మంతరావు నేరుగా బంధంకొమ్ము చెరువును సందర్శించి చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి నిర్మించిన కృష్ణబృందావన్ కాలనీలోని ఇళ్లను గుర్తించి, వాటిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ఇళ్లను బిల్డర్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం కింది స్థాయి సిబ్బంది అమలు చేయకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

వలస పక్షుల జాడ కరువు

ఒకప్పుడు అమీన్‌పూర్ జీవైవిధ్య పెద్దచెరువుతో పాటు బంధంకొమ్ము చెరువులోకి సైతం వలస పక్షులు విడిది చేసి పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకునేవి. క్రమంగా మురికి కూపంలా మారడంతో కనీసం కొంగలు సైతం చెరువు పరిసరాలలో వాలడం లేదు. చుట్టూ ఆక్రమణలు, కాంక్రీటు నిర్మాణాలతో చెరువు ఉనికిని కోల్పోయింది. బంధంకొమ్ము చెరువు ఎర్ర, తెలుపు కలువలకు ప్రసిద్ధి. సీజన్‌లో చెరువంతా తామరాకుతో నిండిపోయి కలువ పూలు విరగబూసేవి. వాటిని చూసేందుకు ఫొటోలు తీసేందుకు పెద్దఎత్తున పర్యావరణ ఔత్సాహికులు తరలివచ్చేవారు. వేల కిలోమీటర్ల నుంచి వలస వచ్చే సైబీరియన్ కొంగలు, ఫ్లెమింగోలు మచ్చుకైనా కనిపించని పరిస్థితి ఏర్పడింది. అమీన్‌పూర్ పెద్దచెరువుతో పాటు బంధంకొమ్ము చెరువును సైతం సంరక్షించాలని జీవవైవిధ్య అధికారులు నిర్ణయించినప్పటికీ ఎవరికి పట్టకపోవడంతో చెరువు క్రమంగా జీవం కోల్పోతోంది.

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలకు నోటీసుల జారీ

బంధంకొమ్ము చెరువు కబ్జాలతో విస్తీర్ణం తగ్గిపోవడం వాస్తవమే. పదేళ్లలో క్రమంగా ఆక్రమణలకు గురవుతూ వస్తోంది. ఉన్న చెరువును కాపాడేందుకు ఆక్రమణదారులకు నోటీసులను జారీ చేశాం. ప్రస్తుతం ఎలాంటి ఆక్రమణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చెరువులోకి డ్రైనేజీ నీరు వచ్చి చేరడం పెద్ద సమస్యగా మారింది. చెరువులోకి మురుగు నీరు కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీ లైన్లు చెరువులోకి వదలకుండా బైపాస్ చేసి తరలించాలి.

- రామస్వామి, పటాన్‌చెరు ఇరిగేషన్ డీఈ



సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో విద్యార్థులకు తుపాకులను చూపిస్తున్న సీపీ డాక్టర్ అనురాధ, సంగారెడ్డిలో తుపాకి పట్టిన విద్యార్థి

పోలీసుల ఓపెన్ హౌజ్

సిద్దిపేట క్రైం/సంగారెడ్డి క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో, సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆయుధాలు, పోలీసు చట్టాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సిద్దిపేటలో జనవరి నుంచి ఇప్పటివరకు రికవరీ చేసిన ప్రాపర్టీ కేసులు ప్రజలకు అందించిన సేవల గురించి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిద్దిపేట పట్టణం, రూరల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని దాదాపు 1500 మంది విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సీపీ అనురాధ స్వయంగా ఆయుధాలపై అవగాహన కల్పించారు.

గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తాం

- ఎక్కడ ఇబ్బంది తలెత్తినా అధికారులపై చర్యలు తప్పవు
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


విద్యార్థినులకు బహుమతిని ప్రదానం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

వర్గల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్రంలోని గురుకులాల్లో అక్కడక్కడ ఫుడ్ పాయిజన్ కేసులు అయ్యాయని, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని, ఈ మేరకు అధికారులను ఆదేశించామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎక్కడ ఇబ్బంది తలెత్తినా అధికారులపై చర్యలు తప్పవని, అవసరమైతే బదిలి చేస్తామని, లేదంటే ఇంట్లో కూర్చొబెడతామని ఆయన హెచ్చరించారు. శనివారం వర్గల్‌లోని మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంవత్సరం క్రితం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తాను మొదటి సంవత్సరం సెలబ్రేషన్‌ను విద్యార్థుల సమక్షంలో చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గురుకులాల్లో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావలసిన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు చన్నీళ్ల స్నానాలు చేయకుండా వాటర్ హీటర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గురుకులాలకు సొంత భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉపాధ్యాయుల నియామకం చేపట్టామని మంత్రి తెలిపారు. పదిహేనుళ్లుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు లేవని, వారిని బదిలీ చేసి అసహనం తొలగించామన్నారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామన్నారు. రూ.5వేల కోట్లతో 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ తీసుకొస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల పాఠశాలల్లో రూ.1100 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించామని అన్నారు. భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పటి నుంచే కష్టపడి చదవుతూ పైకి రావాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. మెదడుకు పనిపెడుతూ, కొత్త ఆలోచనలతో ముందుకెళితే, విద్యార్థులు తమ లక్ష్యాలను నెరవేర్చుకుంటారన్నారు. క్రీడల్లో, చదువుల్లో రాణిస్తూ అన్నింట్లో నంబర్ వన్‌గా పేరు తెచ్చుకోవాలన్నారు. అప్పుడే మీకు, మీ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం క్రీడలో విజేతలైన విద్యార్థులకు మంత్రి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, గురుకలాల సెక్రటరీ తిరుపతి, ఆర్‌సీవో గౌతంకుమార్, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఓ సినిమాలో ఇస్త్రీ చేస్తున్న నటుడు సురేష్

ఈవెంట్స్‌తో మొదలై..
నటుడిగా ఎదిగి


బుల్లితెర, వెండితెరపై రాణిస్తున్న సంగారెడ్డివాసి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 7 : ప్రైవేటు ఈవెంట్స్ ద్వారా తన కేరీర్‌ను ప్రారంభించిన సంగారెడ్డికి చెందిన సురేష్ నటుడిగా చిన్నచిన్న పాత్రలతో వెండితెర, బుల్లితెరపై వెలుగుతున్నారు. ఎన్ని ఒడిదుడుకులు, అవాంతరాలు ఎదురైనా పట్టుదలతో. తన హావభావాలతో అందరినీ మెప్పిస్తూ సినీరంగంలో నటుడిగా గుర్తింపును తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన రాములు, మణెమ్మ దంపతుల కుమారుడు సురేష్ మొదటగా ప్రైవేటు ఈవెంట్లతో కెరీర్‌ను ప్రారంభించారు. స్టేజీ షోలను చేస్తూ అలరించేవారు. సంగారెడ్డి, సిద్దిపేట పట్టణాల్లో స్థానిక లోకల్ టీవీ చానల్స్‌లో యాంకర్‌గాను పనిచేశారు. సినిమాలపై మక్కువతో హైదారాబాద్‌లోని నాగర్జున ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో సంవత్సరం పాటు నటనలో శిక్షణ పొంది ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటి నుంచి వచ్చిన అవకాశలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళుతున్నారు. జీ తెలుగు, జెమిని, ఈటీవీలతో పాటు పలు సినిమాల్లో అవకాశాలను దక్కించుకుని అలరించారు. యజ్ఞం నాటకంలో ప్రదర్శించిన నటనకు ప్రభుత్వ సలహాదారు కేవీ రమణచారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నటించిన సీరియల్స్, సినిమాలు

ఆడదే ఆధారం, అగ్నిపూలు సీరియల్, స్వాతిచినుకులు, నీలో సగం, దీపారాధన, అంతులేని కథ, వదినమ్మ, ఎటో వెళ్లిపోయిందే మనసు, ఇల్లు ఇల్లాలు సీరియల్స్‌లో నటించారు. స్పైడర్‌మెన్, ఆగడు, బందూక్, కిరాక్, నమితా ఐ లవ్‌యూ (కన్నడ మూవీ), కళయా నిజమా, సిద్ధార్థ, బాబా బాగా బుస్సి, యూ-కతె హీరో, ఫలక్‌నుమా దాస్, ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ, రణస్థలం, ఇప్పుడు కాక ఇంకెప్పుడు, హీరో, మేజర్, అల్లూరి, చిత్తమ్ మహారాణి(కన్నడ సినిమా), స్లమ్ డాగ్ హస్బెండ్, భరతనాట్యం, జోడి, ఆగడు, బాబు బాగా బిజీ, కలయా నిజమా, బీటింగ్ హార్జ్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, జీబ్రాలో నటించగా, వీటితో పాటు జమానా, లైలా చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యం



సినిమా రంగంలో కొత్త వారికి అవకాశాలు అంత సులువుగా రావు. టీవీ సీరియల్స్ సినిమా కార్యాలయాలకు ప్రతీ రోజు తిరిగేవాడిని. నటుడిని కావాలనే నా కలని నిజం చేసుకునేందుకు పట్టుదలతో ప్రయత్నాలు చేశాను. మొదట టీవీ షోలో అవకాశాలు వచ్చాయి. నా ప్రతిభను గుర్తించిన కొందరు సీరియల్స్‌లో అవకాశం ఇచ్చారు. అందులో నా నటనను చూసిన నిర్మాతలు, దర్శకులు సినిమాల్లో అవకాశాలు ఇచ్చారు. మంచి నటుడిగా పేరు తెచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

- సురేష్, హాస్య నటుడు, సంగారెడ్డి

నారాయణఖేడ్ మున్సిపాలిటీని
ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో టీయూఐఎఫ్‌డీసీ ద్వారా రూ.20 కోట్లతో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు వారు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చేపట్టి, వీధి దీపాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తాగునీటి సరఫరాతో పాటు అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలో రోజురోజుకు జనాభా పెరుగడమే కాకుండా కాలనీలు పెరుగుతున్నాయని, పట్టణ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు ఫరూక్‌ఖాన్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముంతాజ్, పండరిరెడ్డి, శంకర్, సుబురు, తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో తాగునీటి సమస్యను
20లోగా పరిష్కరించాలి

- హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించిన ఎంపీ రఘునందన్‌రావు


హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను డిసెంబరు 20వ తేదీ లోపు పరిష్కరించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీ రఘునందన్‌రావు కార్యాలయంలో హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై(హెచ్‌ఎండబ్ల్యూఎస్) అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత నెల 30న నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో తాగునీటి సమస్యపై అధికారులకు ఎంపీ పలు సూచనలు చేయగా, డిసెంబరులో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీతో సమావేశమైన అధికారులు మిషన్ భగీరథ ద్వారా జరిగిన పనులు, నీటి సరఫరాపై తీసుకున్న చర్యలను ఎంపీకి తెలియజేశారు. తమ విన్నపంతో మున్సిపాలిటీ తాగునీటి సమస్యపై ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక శ్రద్ధతో అధికారులతో సమావేశం నిర్వహించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నారని బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి తెలిపారు.

దుబ్బాకను
రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

దుబ్బాక, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాకలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలను వేశారు. అనంతరం దుబ్బాక చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


చౌవుల రాంరెడ్డి(ఫైల్)

న్యాల్‌కల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజును వేయబోయి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని చినిగెపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం.. చినిగెపల్లి గ్రామానికి చెందిన రైతు చౌవుల రాంరెడ్డి గ్రామ శివారులోని చెరువు వద్ద తన వేసిన ఉల్లిగడ్డపంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. పొలం పక్కనే ఉన్న చెరువు వద్ద అమర్చిన మోటారు పనిచేయలేదు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు పోవడాన్ని గమనించి వేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో విద్యుదాఘతనికి గురై రైతు చౌవుల రాంరెడ్డి అక్కడిక్కడే మృతిచెందారు. పక్క పొలానికి చెందిన రైతు శంకర్ గమనించి రాంరెడ్డి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డికి సమాచారం అందించాడు. రాంరెడ్డి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని పోస్టుమారం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నీటి గుంతలో పడి వ్యక్తి..


మోహన్ నాయక్ మృతదేహం

చిన్నశంకరంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్న శంకరంపేట మండలంలోని ఎస్‌కొండాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాల మేరకు గవలపల్లి కేరిల్లాతండాకు చెందిన నునావత్ మోహన్ నాయక్(45) ఎస్‌కొండాపూర్ పరిధిలోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పనులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..


బాల్‌రాజ్(ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన సాటుకూరి బాల్‌రాజు (46) బార్బర్ వృత్తి చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం వాకింగ్ చేసేందుకు తూప్రాన్ పట్టణ శివారులోని పెద్ద చెరువు కట్టపైకి బైక్‌పై వెళ్లాడు. చెరువులోకి కడుక్కోడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో వెతకగా, పెద్దచెరువు కట్టపై బైక్ ఉండటంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం బయట పడింది. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

రెండేళ్ల బాలుడిపై శునకాల దాడి


గాయపడిన బాలుడు

రామాయంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరు బయట ఆడుకుంటున్న రెండేళ్ల బాలుడిపై శునకాలు దాడి చేశాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పట్టణంలోని బీసీ కాలనీలో రెండేళ్ల బాలుడు లక్కీ ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీని గమనించిన చుట్టుపక్కల వారు కుక్కలను తరిమి బాలుడిని రక్షించారు. కుటుంబీకులు బాలుడికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించారు.

కృష్ణ జింకకు తీవ్ర గాయాలు

● ఫారెస్టు అధికారులకు అప్పగింత

చిన్నశంకరంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని కృష్ణ జింకకు గాయాలయ్యాయి. ఎస్సై నారాయణ గౌడ్ తెలిపిన వివరాల మేరకు చిన్న శంకరంపేట మండలంలోని ఎస్ కొండాపూర్ మెదక్ చేగుంట రహదారిపై శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో రోడ్డుపై కృష్ణ జింక గాయాలతో పడి ఉన్నది. దీన్ని గమనించిన పోలీసులు జింకను రోడ్డు పక్కకు తరలించి, అనంతరం ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

అక్రమంగా మట్టి తరలింపు

● అడ్డుకున్న గ్రామస్థులు ● కేసు నమోదు

మాసాయిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం బొమ్మారం శివారులో అక్రమంగా మట్టిని తవ్వి రవాణా చేస్తోండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మారం శివారులోని హల్దీవాగు సమీపంలో శుక్రవారం రాత్రి నుంచి భారీ ఎత్తున మట్టిని అక్రమంగా తవ్వి మూడు టిప్పర్లు, ఒక హిటాచి ద్వారా తరలిస్తున్నారు. ఇది గమనించి గ్రామస్థులు చాకచక్యంగా వాహనాలను పట్టుకుని మండల రెవెన్యూ పోలీసు అధికారులకు అప్పజెప్పారు. కాగా, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలిరావటంతో డ్రైవర్లు, యజమానులు ఆ వాహనాలను అక్కడే వదిలి పరారయ్యారు. ఈ సంఘటనతో బొమ్మారం గ్రామం వాగు సమీపంలో కొద్దిసేపు ఉద్రిక్తత వాతవరణం నెలకొన్నది. పోలీసులు అక్కడి చేరుకుని పరిస్థితిని చెక్కదిద్దారు. టిప్పర్ల యజమానులు శ్రీనివాస్, లింగం నాయక్‌లపై కేసులు నమోదు చేశారు. అక్రమ మట్టి రవాణాకు పాల్పలడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

చరిత్రపుటల్లో.. చక్రిభజన

సండే స్పెషల్

● మరుగునపడుతున్న కళను బతికించుకుంటున్న గ్రామస్థులు
● నేటితరానికి ఆదర్శం కొడకండ్ల యువత
● ఆనాడు సీఎం మర్రి చెన్నారెడ్డి నుంచి జ్ఞాపికను అందుకున్న భజన బృందం


చక్రి భజన చేస్తున్న మండలి సభ్యులు

గజ్వేల్/గజ్వేల్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో కళలను పట్టించుకునేవారే లేరు. కానీ ఆ గ్రామ యువకులు గజ్జె కట్టి జనం జేజులు కొట్టాల్సిందే, జెండా పట్టి, కోలాటం ఆడితే చూసేవారికీ చిందేయాలనిపిస్తది. ఈ కళతో జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆ గ్రామానికి గొప్ప పేరున్నది. గ్రామీణ సంస్కృతిని బతికించుకోవడంతో పాటు భావితరాలకు అందజేయాలనే ఉద్దేశంతో చక్రిభజన కార్యక్రమం చేపడుతూ వస్తున్నారు.

ఎనిమిది దశాబ్ధాల క్రితం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన కర్క నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీ సీతారామ భజన మండలి ఇప్పటికీ కొనసాగుతోంది. రిమ్మనగూడ గ్రామానికి చెందిన పండితులు, అవధానులు రాష్ట్రపతి అవార్డు అందుకున్న గౌరిబట్ల రఘురామశర్మ రచించిన ఈ చక్రి భజన నేటి తరాన్ని ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం గ్రామానికి చెందిన యువకులు ఈ భజనను నేర్చుకుని అనేక స్టేజీలపై ప్రజలను ఆకట్టుకుంటున్నారు.

నాడు కొడకండ్లకే.. నేడు విశ్వవ్యాప్తం..

చక్రిభజనలో మొదటిది రాజేశ్వర భజన, రెండవది మాధవ భజన.. గతంలోని పాటల పుస్తకాలను రచించి రెండు విభాగాలుగా తయారు చేసుకొని భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పుస్తకాలను సంస్కృత గ్రాంథిక పదాలతో, పాటలు మధురంగా కొన్ని పదాలు పలకడానికి కష్టంగా ఉంటాయి. అలాంటి పాటలను పద్యాలను నేటికీ పాడుతూ భవిష్యత్తు తరానికి సైతం అందిస్తున్నారు. ఈ భజన ప్రదర్శనలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా దేవాలయాలలో నిర్వహించారు. భద్రాచలం దేవస్థానంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో సీతారామ భజన మండలి ఉత్తమ ప్రదర్శనను గాను ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా శ్రీనటరాజ స్వామి వెండి మెమోంటోను బహుమతిగా పొందారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో సుమారు 150 మంది మండలి సభ్యులు రోజు భజనలు చేస్తూ అలరిస్తున్నారు.

80 యేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వరకు ..

80 సంవత్సరాల నుంచి 8 సంవత్సరాల వయస్సు వారు కుల మత భేదం లేకుండా ఈ భజనలో పాల్గొనడం విశేషం. గ్రామానికి చెందిన కర్కా నారాయణ రెడ్డి మృతిచెందిన అనంతరం కూడా భజన సంస్కృతి పరంపర కొనసాగుతుంది. గ్రామంలో అంతా కలసి ఉమ్మడి కార్యక్రమంగా సాగుతున్న ఈ భజనకు కర్క నారాయణరెడ్డి వారసుల తోడ్పాటును, ప్రోత్సాహన్ని అందిస్తున్నారు.

ఇదే చక్రి భజన..

శివారమణ... శంబోహర భజత... గోపాలం రామాధవం అంటూ భజనను ప్రారంభిస్తారు. తబలా కళాకారులు తబల కొడుతూ, హార్మోనియం వాయిస్తూ వీక్షకులను ఆకట్టుకుంటారు. కొద్ది మంది మధ్యలో కూర్చొని తాలలు కొడుతూ పాటలు పాడతారు. వీరి చుట్టూ చక్రం (గుండ్రంగా) నిలబడి పాడిన పాటకు పదాలకు అనుగుణంగా భక్తుల భావజాలాలు ఉంటాయి. మధ్యలో తాళాలు, జెండాలు, కోలాటం, మంగళ హారతి పాటలకు తగ్గట్టుగా భక్తులు ఆడుతారు.

వివిధ గ్రామాల నుంచి కూడా శ్రీ సీతారామ భజన మండలి భక్త బృంథ కొడకండ్ల వారిని ఆహ్వానిస్తున్నారు. వినాయక, దుర్గామాత మండపాలు, అలయల్లోనూ వీరి ఆధ్వర్యంలో భజన నిర్వహిస్తున్నారు.

మా నాన్నను చూసి నేర్చుకున్నాను



మా నాన్నతో నేను ఆరు సంవత్సరాల వయస్సు నుంచే భజన కార్యక్రమం ఎక్కడ చేస్తే అక్కడికి వెళ్తున్నాను. మా నాన్నని చూసి పాటకు తగ్గట్టుగా నృత్యం చేయడం నేర్చుకున్నాను. నేటికీ ఈ భజన మండలి ఆధ్వర్యంలో చాలాచోట్ల ప్రదర్శనలు చేస్తున్నాం. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసి భజనలు చేస్తాం. ఇది మా గ్రామస్థుల గొప్ప అదృష్టంగా భావిస్తాను.

-కర్నాల గణేష్

చిన్నప్పటి నుంచే భజన చేస్తున్నాను



ఇప్పుడు నా వయసు 67 సంవత్సరాలు. నా చిన్నప్పటి నుంచే భజన చేస్తున్నాను. ఎక్కడ భజన అయితే అక్కడికి భక్తులను తీసుకెళ్లే కార్యక్రమంలో నేను ముందు ఉంటాను. ఈ ఆనవాయితీని, ముందు తరాలకు అందిస్తాను.

- పులగం నర్సింహులు

చక్రిభజన నేటి తరానికి ఆదర్శం



ప్రస్తుతం నా వయస్సు 56 సంవత్సరాలు. నేను చిన్నప్పటి నుండి భజన మండలి సభ్యుడిగా ఉన్నాను. గత 30 సంవత్సరాల నుంచి భజన కీర్తనలు పాడుతున్నాను. నా పాటలకు అందరూ తాళాలు, హావభావాలతో నృత్యం చేస్తారు. ఎన్నో జన్మల పుణ్యఫలం. ఈ జన్మలో పాటలు పాడడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

-బాణాల బిక్షపతి

మా తాత వారసత్వాన్ని కొనసాగిస్తున్నాం



దాదాపు 80 సంవత్సరాల క్రితం మా తాత కర్క నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ భజన మండలి ప్రారంభమైంది. నేటికీ, భజన కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మా తాత తర్వాత మా నాన్న... వారి తర్వాత మేము ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నాం. దాంతోపాటు ఊరందరి సహకారం కూడా ఈ భజన మండలికి ఎల్లవేళలా ఉంది. చక్రీభజనకు నేటికీ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎలాంటి తారతమ్యాలు లేకుండా భజన మండలి అజేయంగా నిలుస్తుంది.

- సుదర్శన్ రెడ్డి

ఈ భజన ఎప్పటికీ కొనసాగాలి



చక్రిభజన మా పెద్దలు మాకు అందించిన ఒక గొప్ప ఈ ఆధ్యాత్మిక సంస్కృతి. మా గ్రామంలో దాదాపు ఉన్నత విద్యావంతులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు అందరూ కులమతవర్గ భేదం లేకుండా భజన మండలి సభ్యులుగా ఉంటున్నారు. అందరు ఆప్యాయతను పంచుకునే విధంగా కృషిచేస్తున్నాం. శ్రీ సీతారామచంద్ర భజన మండలిలో గొప్ప భావన కలుగుతుంది. ఇది మాకు వరంగా భావిస్తున్నాను, ఈ భక్తి పరంపర ఎప్పటికీ కొనసాగాలని కోరుకుంటాను.

- దూలం నర్సింహులు గౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఇప్పటికీ ఆచరించడం అభినందనీయం



మా తాత రఘురామ శాస్త్రి సాక్ష్యాత్తు సరస్వతి పుత్రులు. వేదశాస్త్ర సంస్కృత సాహిత్యాలలో అపారమైన పాండిత్యం కలిగిన ఆయన అనేక రచనలు రచించారు, వ్యాస తాత్పర్య నిర్ణయము, ఏక ప్రాస శత పద్యమాలిక, భావానంద స్వామి జీవిత చరిత్ర, రాజేశ్వర భజన, మాధవ భజన, కర్పూర కలిక ఇలా ఎన్నో రచించారు. ఇప్పటికీ కొడకండ్ల గ్రామస్థులు మా తాత రాసిన భజనలను ఆచరిస్తున్నారు. నాటి కాలపు వారసత్వాన్ని కొనసాగిస్తున్న గ్రామస్థులు నిజంగా అభినందనీయులు

-గౌరీభట్ల సోమనాథ శర్మ సిద్ధాంతి

సమస్యలను అధ్యయనం చేయండి

● సీనియర్ ఐఏఎస్ అధికారి, నేషనల్ ట్రైనింగ్ అకాడమీ మీజోరామ్ డైరెక్టర్ లాల్ బహదూర్



లాల్ బహదూర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సమస్యల అధ్యయనానికి కలెక్టర్, అధికారులు గ్రామాల్లో పర్యటించాలని సీనియర్ ఐఏఎస్ అధికారి, నేషనల్ ట్రైనింగ్ అకాడమీ మీజోరామ్ డైరెక్టర్ లాల్ బహదూర్ సూచించారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఐఏఎస్ అధికారుల శిక్షణను పరిశీలించేందుకు పర్యటిస్తున్న ఆయన సంగారెడ్డి కలెక్టరేట్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్ శిక్షణను పరిశీలించేందుకు శనివారం కలెక్టరేట్‌కు వచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తయ్యేటా చూడాలన్నారు. కలెక్టర్లు, అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టవచ్చన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో శానిటేషన్, పార్కింగ్, పబ్లిసిటీ, పట్టణాల్లో ప్రధాన కూడళ్ల వద్ద చెత్త వేసే స్థలాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాలు చెరువుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం కలెక్టర్ లాల్ బహదూర్‌కు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాదురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంధకారంలో ముప్పారం

● రెండు రోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా.. ● పట్టించుకోని అధికారులు

అల్లాదుర్గం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్వర్ గ్రామం నుంచి విద్యుత్ సరఫరా చేసే ఫీడర్‌తో ఏడు గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో ఎక్కడైన సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఇతర గ్రామాలకు సరఫరా ఆపి వేసి మరమ్మతులు చేయాల్సి వస్తున్నది. అయితే మండలంలోని ముప్పారం గ్రామానికి ఈ నెల 6 (శుక్రవారం) సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయినా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడంతో ఆ గ్రామస్థులకు అవస్థలు తప్పడంలేదు. శనివారం సాయంత్రం 6.30 గంటల వరకు కూడా విద్యుత్ పునరుద్ధరించలేదని గ్రామస్థులు మండిపడ్డారు. శనివారం ఓ వైపు వర్షం కురుస్తుండగా, మరో వైపు విద్యుత్ సరఫరా లేక నరకయాతన అనుభవించామని వాపోయారు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో చిమ్మచీకట్లో కాలం గడపవలసి వస్తుందన్నారు. రెండు రోజులుగా కరెంటు లేకున్నా అధికారులు కనీసం కన్నెత్తికూడా చూడక పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏడు గ్రామాలకు ఒకే ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండటంతో తరుచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయం పై సంబంధిత అధికారులకు విన్నవించిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తరుచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయానికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



లియోషా డబుల్ ధమాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కోరుకొండ లియోషా సింగిల్స్, డబుల్స్‌లో విజేతగా నిలిచింది. థానేలో జరిగిన ఈ పోటీల్లో సంగారెడ్డి అమ్మాయి లియోషా అండర్-11 సింగిల్స్ ఫైనల్లో 21-16, 17-21, 21-12తో శాన్విపై, డబుల్స్ ఫైనల్లో లియోషా-శాన్వి జోడీ 15-21, 21-16, 21-9తో సుమ-శాంభవి ద్వయంపై గెలిచింది. లియోషా తెల్లాపూర్‌లోని సిక్కీ-సుమిత్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది.

కొలువుదీరిన మల్లన్న ఆలయ పాలకమండలి


ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయపాలక మండలి శనివారం కొలువుదీరింది. ప్రభుత్వం ఇటీవల 8 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ముఖ మండపంలో ఈవో బాలాజీ ఆధ్వర్యంలో ఎనిమిది సభ్యులు చిగిరి కొమురయ్య, కాయిత మోహన్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వలాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, నేరళ్లపల్లి మచ్చేందర్‌రెడ్డి, కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, మహాదేవుని మల్లికార్జున్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ధర్మకర్తలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిర్వాసితులపై అబద్ధాల ప్రచారం

● మల్లన్నసాగర్ భూనిర్వాసితుడు శ్రీనివాస్‌రెడ్డి


గజ్వేల్ మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది నేతలు తమ స్వార్థ రాజకీయాల కోసం 65ఏళ్ల పైబడిన మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల విషయంలో అబద్ధాలు చెబుతున్నారని, వాటిని నమ్మొద్దని మల్లన్నసాగర్ భూనిర్వాసితుడు ఎర్రన్నగారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గజ్వేల్ పట్టణంలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ సారథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు.

అకాల వర్షం

జలమయమైన రోడ్లు

పలు గ్రామాల్లో తడిసిన ధాన్యం


రేగోడులో కురుస్తున్న వర్షం


సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం అకాల వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. మోస్తరు వర్షానికి కొన్ని చోట్ల రోడ్లు జలమయమయ్యాయి.

● తొగుట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. తొగుట మార్కెట్ యార్డులో బక్కోళ్ల సంతోష్‌రెడ్డికి చెందిన ధాన్యం వరదలో కొట్టుకుపోయింది. రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

● టేక్మాల్ 7 డిసెంబర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గంట పాటు వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. మండల కేంద్రంలో వారాంతపు సంతలో కొనుగోలు, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుక్కులను దున్నేందుకు మేలు జరిగిందని రైతులు తెలిపారు.

● రేగోడు డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉరుములతో కూడిన వర్షం శుక్రవారం సాయంత్రం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉండగా సాయంత్రం ఒక్క సారిగా మబ్బులు కమ్ముకొని వర్షం పడింది.



టేక్మాల్ వర్షం..


తొగుట మార్కెట్ యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యం

● జగదేవ్‌పూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని పలు గ్రామాలలో భారీ వర్షం కురిసింది. వరి ధాన్యం తడిసిపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

●సిద్దిపేట పట్టణంలోని రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, సీతారామాంజనేయ థియేటర్ పరిసరాలను వరద ముంచెత్తింది. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

క్రీడోత్సవాలు ప్రారంభం

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లిలో క్రీడోత్సవాలను శనివారం ఎంఈవో కిష్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

● మద్దూరు: మండలంలోని రేబర్తిలో సీఎం కప్ క్రీడోత్సవాలను ఎంఈవో వరద రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రబాను, పీఈటీ ఇంతియాజ్ హుస్సేన్, కార్యదర్శి మాధవ్ జాదవ్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలసి గతంలో సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనా తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 17 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి 17 మందికి రూ.19,500 జరిమానా విధించారు.

యునాని దవాఖాన ఉన్నా.. లేనట్టే!?

● విధులకు హాజరుకాని ఇన్‌చార్జి వైద్యురాలు
● పట్టింపులేని జిల్లా అధికారులు
● మూతపడే దిశగా ఆసుపత్రి

మద్దూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ప్రజలు వైద్యసేవలందించిన యునాని దవాఖాన మూతపడే దిశగా అడుగులు వేస్తున్నది. ఇన్‌చార్జి వైద్యురాలు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెజ్జంకి నుంచి వచ్చిన ఇన్‌చార్జి వైద్యాధికారి డిప్యుటేషన్ రద్దు చేసుకుని వెళ్లగా ఫార్మాసిస్ట్ సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర దవాఖానకు వెళ్లారు. దీంతో దవాఖానా మూతపడే పరిస్థితి రావడంతో కరీంగనర్‌లో పని చేస్తున్న వైద్యురాలిని డిప్యుటేషన్‌పై ఇక్కడకు తీసుకువచ్చారు. వైద్యాధికారి ఒక్కరే ఉండటంతో విధులకు సక్రమంగా హాజరుకాక యునానీ దవాఖానా ఉండీ లేనట్టు తయారైందన్న విమర్శలు అధికమయ్యాయి..

అధికారుల పట్టింపు కరువు

మరోవైపు పీహెచ్‌సీలోని ఓ గదిలోకి తరలించి ఏర్పాటు చేసుకున్న యునానీ దవాఖానా తీసే ఉంటున్నట్లుగా ఉంటోంది. కానీ సిబ్బంది ఎవరూ ఉండరు. ఎవరూ పట్టించుకోరు. పీహెచ్‌సీ నిత్యం తీస్తుండటంతో యునానీ దవాఖానానను ప్రజలు మర్చిపోయారు. వైద్యాధికారులు వస్తే వచ్చినట్లు లేకపోతే లేనట్లు అన్న చందంగా మారింది. అప్పుడప్పుడు కొత్తగా వచ్చే డీఎంహెచ్‌వోలు తనిఖీ పేరిట వచ్చినా యునాని దవాఖాన పరిస్థితులపై వివరించినా తమ పరిధిలోకి రాదంటూ సమాధానాలు దాటవేసి వెళ్తున్నారు.

ఫార్మాసిస్ట్ కారణంగా..

గతంలో ఫార్మాసిస్ట్ ఒక్కరే ఉన్నప్పుడు డిప్యూటేషన్‌పై వెళ్లగా నూతనంగా వచ్చిన వైద్యాధికారి ఝాన్సీ డిప్యుటేషన్‌పై వెళ్లిన ఫార్మాసిస్ట్‌ను తిరిగి తీసుకువచ్చేలా చేశారు. కొద్ది నెలలు సేవలు సక్రమంగా అందుతున్న సమయంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకు నేషనల్ ఆయూష్ మిషన్ ఆధ్వర్యంలో 421 యోగా షెడ్లు మంజూరయ్యాయి. అలా మద్దూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కొనసాగుతున్న యునాని దవాఖానకు యోగ షెడ్డు మంజూరైంది. యోగా షెడ్డు అందుబాటులోకి వచ్చే సమయంలోనే ఫార్మాసిస్ట్ విధులకు డుమ్మా కొడుతుండటంతో విసిగి వేసారిన వైద్యాధికారి బదిలీ చేయించుకుని హైదరాబాద్‌కు వెళ్లారు.



యునానిలో వృథాగా ఉన్న మందులు

కానరాని ఇన్‌చార్జి వైద్యురాలు

దీంతో బెజ్జంకిలో పని చేస్తున్న వైద్యాధికారిని డిప్యుటేషన్‌పై వేయడంతో సక్రమంగా విధులకు హాజరుకాలేదు. ఫార్మాసిస్ట్ సరిగ్గా రాకపోవడంతో విమర్శలు వెలువెత్తాయి. దీంతో లాంగ్‌స్టాండింగ్‌లో ఉన్న వారిని బదిలీ చేయడంతో అలా ఫార్మాసిస్ట్ బదిలీపై ఇతర ప్రాంతానికి వెళ్లారు. దీంతో డిప్యుటేషన్‌పై వచ్చిన వైద్యాధికారి సొంత ప్రాంతానికి వెళ్లారు. దీంతో దవాఖాన మూతపడకుండా ఉండేందుకు కరీంనగర్‌లో పనిచేస్తున్న వైద్యాధికారిని డిప్యుటేషన్‌పై వేయగా వస్తే వచ్చినట్లు లేకుంటే లేనట్లుగా దవాఖానా పరిస్థితి మారింది. యునానీ దవాఖానను గ్రామంలోని గ్రామపంచాయతీ షట్టర్‌లోకి మార్చాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు సూచించినా ఎవరికి పట్టింపులేకుండా పోయింది.

రాజీమార్గమే రాజమార్గం: అదనపు డీసీపీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజ మారమని, ఈ నెల 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట కమిషనర్ కార్యాలయంలో కోర్టు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జాతీయ మెగా లోక్ అదాలత్‌పై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ కేసులు రాజీ పడేటట్లు కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. రాజీపడే కేసులను లిస్ట్ అవుట్ చేసుకోవాలని, రాజీపడ దగిన కేసుల్లో ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో కోర్టు మానిటర్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

సిద్దిపేట టౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకుడు పైసా రామకృష్ణ హైదరాబాద్‌లోని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఆయనకు హరీశ్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో హరీశ్‌రావు

‘తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చడం అవమానకరం’

చిన్నకోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవత రూపాన్ని పోలి ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చి మానవ రూపంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలంగాణకు అవమానకరమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర విమర్శించారు. చిన్నకోడూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ గౌరవప్రదమైన బతుకమ్మను, కిరీటాన్ని తొలగించి కాంగ్రెస్ గుర్తును సూచించే విధంగా హస్తాన్ని ఉంచడం హేయమైన చర్య అని మండిపడ్డారు. వారివెంట నాయకులు జంగిటి శ్రీనివాస్, ఆనంద్, రాజశేఖర్ రెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

చదువుకు అంగవైకల్యం అడ్డుకాదు

● ఎంఈవో సత్యనారాయణరెడ్డి

రాయపోల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుకు అంగవైకల్యం అడ్డురాదని మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని దివ్యాంగులైన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మండలంలోని సుమారు 30 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఎందరో దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని అన్నారు.

● కొండపాక: కొండపాకలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దివ్యాంగ దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రంగనాథ్, ఎంఈవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగుల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల కొండపాక ప్రధానోపాధ్యాయుడు విఠల్‌నాయక్, బాలుర ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, స్థానిక ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి, ఎల్లం స్పెషల్ ఎడ్యుకేటర్ రాకేష్, శ్రీకాంత్, ఐఈఆర్‌పీ రజిత దివ్యాంగ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాయపోల్: తాము వేసిన బొమ్మలు చూపుతున్న దివ్యాంగ విద్యార్థులు

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

● సర్వీసు ఆపేసి డ్రైవర్ల నిరసన

బెజ్జంకి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడంతో ఉపాధి కోల్పోయామని, తమను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇస్తానన్న రూ. 12 వేలు అందించాలని ఆటో యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో శనివారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆటో యూనియన్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల 50 వేల మంది ఆటో డ్రైవర్‌లు ఉన్నారని, వారందరూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 62 మంది ఆటో డ్రైవర్‌లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

● కోహెడ: రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఆటో బంద్ కోహెడ మండలంలో విజయవంతం అయింది. మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఆటోలను నిలిపివేశారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆటో కార్మికుల ఐక్యత వర్థిల్లాలంటూ స్థానిక బస్టాండ్ ఆవరణలో నినాదాలు చేశారు.



బెజ్జంకిలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దు

● జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కోరిన డీబీఎఫ్

గజ్వేల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్(సీఆర్‌పీసీ-41) ఇవ్వొద్దని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్‌సింగ్ ఆర్యను డీబీఎఫ్ నాయకులు కోరారు. ఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పనలు శనివారం కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై చర్చించారు.



వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

వేతనాల్లో కోత విధించారని విధులు బహిష్కరించిన పారిశుధ్య కార్మికులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

గజ్వేల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు కట్ చేయడంతో వారు విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గజ్వేల్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనికి రాలేదన్న కారణంతో వేతనాలు కట్ చేసే విధానాన్ని తప్పుబట్టారు. వారాంతపు సెలవులు, జాతీయ, పండుగ, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు విధుల్లో చేరారు. వారితో నాయకులు యాదగిరి, కుమార్, స్వామి, నర్సింహులు, బాలయ్య తదితరులు ఉన్నారు.

బాలల రక్షణ, సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

● చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి లక్ష్మణ్



విద్యార్థులతో లక్ష్మణ్

సిద్దిపేట రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణ, సంరక్షణ పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ అన్నారు. నారాయణరావుపేట మండలం ఇబ్రహింపూర్ పాఠశాలలో శనివారం బాలల రక్షణ, సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చైల్డ్ రైట్స్ పోక్సో యాక్ట్, సెల్ఫ్ అవేర్నెస్‌పై అవగాహన కల్పించారు. బాలలకు ఏ సమస్య వచ్చినా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కి కాల్ చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాలల పరిరక్షణ విభాగం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలేష్‌గౌడ్

దుబ్బాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలేష్‌గౌడ్ ఆరోపించారు. దుబ్బాకలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయనవెంట బీజేపీ నాయకులు సుభాష్‌రెడ్డి, చారి, రమేష్, ప్రవీణ్ ఉన్నారు.

తండ్రికి తలకొరివిపెట్టిన కూతురు



తండ్రికి తలకొరివి పెడుతున్న కూతురు శ్రావణి

దుబ్బాక, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తండ్రికి కూతురు తలకొరివిపెట్టిన ఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో శనివారం చోటుచేసుకుంది. దుబ్బాకకు చెందిన దోమ్మాట బాల్‌రాజు(52)అనే వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. బాల్‌రాజుకు కుమారులు లేకపోవడంతో పెద్దకూతురు శ్రావణి తండ్రికి తలకొరివి పెట్టింది. దీంతో అంత్యక్రియలకు వచ్చిన ప్రతిఒక్కరూ కన్నీటిపర్యంతమయ్యారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయిన బాలుడిని చూసి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. కొమురవెల్లి మండలం తపాసుపల్లి గ్రామ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్కని శ్రీకాంత్ అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రామాన్ని చేరుకుని శ్రీకాంత్ అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

ఉపాధిహామీ వేతనాలు చెల్లించాలి

● డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు

గజ్వేల్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు డిమాండ్ చేశారు. గజ్వేల్ మండలం పిర్చేడులో శనివారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వేతనం కోసం నెలలు రోజులుగా ఎదురుచూస్తున్నామని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మల్లయ్య, యాదయ్య, బుచ్చయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ నిర్వహణపై అవగాహన

● విద్యార్థులకు వివరించిన పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్

కొండపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ నిర్మాణం, పారిశుధ్య పనులు, సిబ్బంది విధులు తదితర అంశాలపై మండలంలోని దుద్దెడ గ్రామపంచాయతీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిద్దిపేటకు చెందిన ఆద్య పాఠశాల విద్యార్థులు గ్రామపంచాయతీని సందర్శించారు. పలు అంశాలపై పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్‌గౌడ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారివెంట పాఠశాల కరస్పాండెంట్ మాధవి, ప్రిన్సిపాల్ అనుశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సిద్దిపేట రూరల్: నారాయణరావుపేట మండలం మాటిండ్ల ఆర్‌డీఎఫ్ పాఠశాలలో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నర్సింగోజు విష్ణుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎలా జరుగుతుంది అసెంబ్లీలో ఎవరెవరు పాల్గొంటారు, విద్యార్థులకు అసెంబ్లీపై అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.



సిద్దిపేట రూరల్: మాక్ అసెంబ్లీలో విద్యార్థులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ప్రజాపాలన కో ఆర్డినేటర్ నారాయణరెడ్డి

సిద్దిపేట రూరల్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ప్రజా పాలన కో ఆర్డినేటర్ నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన సందర్భంగా నారాయణరావుపేట మండల కేంద్రంలో శనివారం ప్రజా పాలన సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామచంద్రం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాగన్న కరుణాకర్, ఫీషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ వీర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

● హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ హుస్నాబాద్ పట్టణ పార్టీ శాఖ, మండలశాఖ ఆధ్వర్యంలో వేరువేరుగా ప్రజా విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు సింగిల్‌విండో చైర్మన్‌బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందరు తదితరులు పాల్గొన్నారు.

● మిరుదొడ్డి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల మన్ననలు పొందిందని దుబ్బాక బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్‌అన్నారు. మండల కేంద్రమైన అక్బర్‌పేట-భూంపల్లి పార్టీ కార్యాలయంలో మాట్లాడారు



సిద్దిపేట రూరల్: అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉన్నత స్థానాలకు ఎదగాలి

● పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్



రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్

చిన్నకోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర ఆకాంక్షించారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాములు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్రకు పుష్పగుచ్ఛ అందజేసి స్వాగతం పలికారు. వారివెంట కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీవో సరిత



గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీవో సరిత

ములుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని గజ్వేల్ సీడీపీవో సరిత అన్నారు. మండలంలోని కొక్కొండ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమతుల్యంతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిత, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఓంకార్

దూళిమిట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఓంకార్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మెదక్ జిల్లా మూసాయిపేటలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడాని తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కన్నుల పండువగా శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

● సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా నిర్వహణ
● భారీగా తరలివచ్చిన భక్తులు

వర్గల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీవల్లి దేవసేన సుబ్బహ్మణ్యస్వామి క్షేత్రంలో శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆలయ వేద పండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై సతీ సమేతులైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శ్రీవల్లి దేవసేన సుబ్బహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

వర్గల్ నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో లోకకల్యాణార్థం, ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయం వద్ద నవగ్రహ హోమం, శ్రీసుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు.

● చేర్యాల: చేర్యాల పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు తాటిపెల్లి శకుంతలాంజనేయులుగుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

● మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెలో శ్రీరామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సుబ్రహ్మణ్య హోమాన్ని పురోహితుడు మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● కొండపాక: మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు రవీందర్, మల్లేశం, రాజేంద్రప్రసాద్, తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, ట్రాన్స్ కో ఏఈ సత్యం పాల్గొన్నారు. అలాగే కొండపాక ఆనంద నిలయం ఆవరణలో ఉన్న అష్టాదశ శక్తిపీఠాల ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించి రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రిగా పొన్నం ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేసి ఏడాది గడిచిన సందర్భంగా గౌడ సంఘం నాయకులు హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.



వర్గల్ విద్యాధరిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ పండితులు



కొండపాకలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఎగవేతలకు ఏడాది

5వ పేజీ తరువాయి..

ఖర్చులకు రూ.27 కోట్లు, మహతి ఆడిటోరియానికి రూ.50 కోట్లు, టూటౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ల నిర్మాణ పనులకు రూ.8.50 కోట్లు రద్దు చేయడంతో పనులన్నీ ఆగిపోయాయి.

సిద్దిపేట ప్రగతిని అడ్డుకోవాల్సిన అవసరం ఎవరికి ఉంది?

మా ప్రభుత్వం ఉన్న సమయంలోనూ సిద్దిపేట నియోజకవర్గంపై రేవంత్‌రెడ్డికి అక్కసు ఉంది. పదేపదే సిద్దిపేట గురించి రాష్ట్రమంతటా ప్రచారం చేశారు. ఆయన అధికారంలోకి రాగానే సిద్దిపేటపై చిన్నచూపు ప్రారంభించారు. పనులను ఆగిపోయేలా చేశారు. నిధులన్నీ రద్దు చేయాలని అధికారులకు సూచించారు. రూ.300కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కళాశాల భవన నిర్మాణ పనులను ఆపివేయించి తన నియోజకవర్గమైన కొడంగల్‌కు తరలించారు. సిద్దిపేటకు దక్కిన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడంలోనే ఆయన అక్కసు బయటపడింది. ఈ ఏడాది పాలనలో సిద్దిపేట అభివృద్ధి పరంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నిధులను సాధించడంలో మీ కర్తవ్యం?

ఇప్పటికే నిధులను రద్దు చేశారనే విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ప్రత్యేకంగా లేఖలు రాశాను. అయినా స్పందన లేదు. నిలిచిన పనులు ప్రారంభమయ్యేదాకా వదిలిపెట్టను. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సిద్దిపేట అభివృద్ధి గురించి మాట్లాడుతా. సీఎంతోపాటు మంత్రులను నిలదీసైనా నిధులు సాధిస్తా.